లో ఓల్టేజ్ సమస్యతో సతమతం

- కాలిపోతున్న విద్యుత్ సామగ్రి
- మోతమోగుతున్న బిల్లులు
- చోద్యం చూస్తున్న విద్యుత్ అధికారులు



లక్ష్మీపురం: వేసవి ఉష్ణోగ్రతలు బాగా పెరిగాయి. ఎడాపెడా విద్యుత్ బిల్లులు మోతమోగుతున్నాయి. ఉక్కపోతతో జనం సతమతమవుతున్నారు. కరెంట్ సప్లయికి అనుగుణంగా సరఫరా చేయలేకపోతున్నారు. కోతలు ఇష్టారాజ్యం నిర్వహిస్తున్నారు. చిన్నపాటి సమస్యను చూపి గంటల తరబడి సరఫరా నిలిపివేస్తున్నారు. దీంతో పిల్ల, పెద్దలు ఉక్కపోత భారించలేకపోతున్నారు. విద్యుత్ అధికారులు పట్టించుకోవడం లేదు.

కొబాల్ట్‌పేటలో సమస్య...

నగరంలోని అనేక ప్రాంతాలకు చెందిన ప్రజలు విద్యుత్ సమస్యతో అవస్థలు పడుతున్నారు. కొబాల్ట్‌పేటలో 34వ డివిజన్ ప్రాంతంలో విద్యుత్ సరఫరా లోపంతో విద్యుత్ గృహోపకరణాలు కాలిపోతున్నాయి. ఈ ప్రాంతంలో 1వ లైన్ నుంచి 8వ లైన్ వరకు అనేక రకాల చిరు వ్యాపారులు, చిరు ఉద్యోగులు, కార్మికులు, కూలీలు జీవనం సాగిస్తుంటారు. ఈ ప్రాంతంలో నిత్యం పారిశుధ్యం, కుక్కల సమస్యలతో ఇబ్బందులు పడుతుంటే మరో వైపు మేము ఏమైన తక్కువ తిన్నామా అంటూ విద్యుత్ శాఖ కూడా తమ ప్రతాపంతో ఓల్టేజ్ రూపంలో చూపిస్తుంది. పగలు, రాత్రి తేడా లేకుండా లో ఓల్టేజ్ సమస్య ఇబ్బందులకు గురిచేస్తోంది. ఒక వైపు ఎండ తీవ్ర రూపం దాల్చుతుంటే మరో వైపు లో ఓల్టేజ్ కారణంగా విద్యుత్ పరికరాలు కాలి పోతున్నాయంటే స్థానికుల ఆవేదన చెందుతున్నారు. విద్యుత్ సరఫరాలో ఎలాంటి సమస్యలు ఉండకుండా విద్యుత్ సబ్‌స్టేషన్‌లను ఏర్పాటు చేశారన్న విషయాన్ని మరిచిపోయారు. సమగ్రమైన ఓల్టేజ్ లేని కారణంగా విద్యుత్‌పరికరాలు, ఫ్యాన్‌లు, కూలర్లు, ఏసీలు, లైట్లు, ఫ్రిజర్లు వంటి పలు రకాల విద్యుత్‌పరికరాలు పని చేయక పోగా మరమ్మతుల పాలవుతున్నాయని స్థానికులు వాపోతున్నారు.

గృహోపకరణాలు కాలిపోతున్నాయి...



కొబాల్ట్‌పేట ప్రాంతంలో గత కొంత కాలంగా విద్యుత్ సరఫరా సక్రమంగా ఉండడం లేదు. లో ఓల్టేజ్‌తో గృహోపకరణాలు కాలిపోతున్నాయి. ఫ్యాన్‌లు తిరగడం లేదు. ఏసీలు పని చేయడం లేదు. 2,4,5,7 లైన్‌లలో విద్యుత్ ట్రాన్స్‌ఫారాలు ఉన్నా కాని వాటిని నెలకు ఒక సారి అయిన పరిశీలించి మరమ్మతులు చేసే నాథుడే లేడు. లో ఓల్టేజ్ సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలి.

–సయ్యద్ ఆదం సాహెబ్, వినియోగదారులు సంఘం

తక్షణమే చర్యలు తీసుకుంటాం

కొబాల్ట్‌పేటలో లో ఓల్టేజ్ సమస్య ఉన్నట్లు మా దృష్టికి రాలేదు. పరిశీలించి తక్షణమే చర్యలు తీసుకుంటాం. అలాగే లో ఓల్టేజ్ సమస్యను పరిష్కరించేందుకు కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేస్తాం. వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తాం.

–నాగరాజు, కృష్ణానగర్ ఏఈ

క్లుప్తంగా

పోలవరం కట్టే ఉద్దేశం లేదా..!

మాజీ ఎమ్మెల్యే మస్తాన్‌వలి



లక్ష్మీపురం: బనకచర్ల అనే పేరుమీద మళ్లీ రాష్ట్ర ప్రజలను కూటమి ప్రభుత్వం మోసం చేసే ప్రయత్నం చేస్తోందని కాంగ్రెస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే షేక్ మస్తాన్‌వలి అన్నారు. స్థానిక పాన్నూరు రోడ్డులోని ఆయన కార్యాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. పోలవరం కట్టే ఉద్దేశం ఈ కూటమి ప్రభుత్వానికి గాని దేశ ప్రధాని నరేంద్ర మోదీ గాని ఉందా లేదా అని ప్రశ్నించారు. పోలవరం కట్టే ఉద్దేశం ఉంటే కేంద్ర ప్రభుత్వం పార్లమెంటు సాక్షిగా చెప్పిన సమాధానం మీద ఈ కూటమి ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రజలకు సంక్షేమ అవసరం లేదంటారా, అదైనా చెప్పాలని నిలదీశారు.

లీగల్ మెట్రాలజీ డెప్యూటీ కంట్రోలర్‌గా హరిబాబు



నెహ్రూ నగర్: లీగల్ మెట్రాలజీ(తూనికలు కొలతల శాఖ) డెప్యూటీ కంట్రోల్(డీసీ)గా బీవీ హరిబాబు సోమవారం సిద్ధార్థ గార్డెన్స్‌లోని ఆ శాఖ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఇప్పటి వరకు ఇక్కడ డీసీగా పనిచేసిన టి.షాలెం రాజ్ విజయవాడ హెడ్ ఆఫీస్‌కు బదిలీపై వెళ్లారు. అదేవిధంగా అసిస్టెంట్ కంట్రోలర్‌గా పని చేసిన జి.కొండారెడ్డి అనకాపల్లికి బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో నరసరావుపేట అసిస్టెంట్ కంట్రోలర్‌గా పనిచేస్తున్న ఎన్.అల్లూరయ్య గుంటూరుకు బదిలీపై వచ్చారు.

ఎన్జీ రంగాకు నివాళి



గుంటూరు మెడికల్: స్వాతంత్ర్య సమరయోధులు ఆచార్య ఎన్జీ రంగా వర్ధంతి సందర్భంగా సోమవారం స్థానిక బృందావన్‌గార్డెన్స్‌లోని రంగా విగ్రహానికి బీజేపీ నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించి ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు యడ్లపాటి స్వరూపారాణి, యడ్లపాటి రఘునాథబాబు, దేశు సత్యనారాయణ, ఎ.అంజిరెడ్డి, పాల్గొన్నారు.

కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ అందించాలి



ప్రత్తిపాడు: కౌలు రైతులకు కూడా అన్నదాత సుఖీభవ పథకాన్ని వర్తింపజేయాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి రామిశెట్టి ఆదేశ్వరరావు అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం సీపీఐ ఆధ్వర్యంలో తహసీల్దార్ జి.కరుణకుమార్‌ను కలిసి వినతి పత్రం అందించారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతున్న దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు రైతులు, కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా కౌలు రైతు సంఘ కార్యదర్శి జగన్నాథం మాట్లాడుతూ.. నల్లబర్లీ పొగాకును సాగు చేసిన రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. రూ.లక్షల్లో పెట్టుబడులు పెట్టి అప్పుల పాలయ్యారని, వెంటనే ప్రభుత్వం వారిని ఆదుకునేందుకు చర్యలు చేపట్టి కొనుగోళ్లు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కౌలు రైతు సంఘ అధ్యక్షుడు విటల్‌రెడ్డి, స్థానికులు పరమేశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.

విశాఖ కార్మికులకు సంఘీభావంగా నిరసన



శంకర్ విలాస్ సెంటర్‌లో నిరసన వ్యక్తం చేసిన కార్మిక సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ సభ్యులు

లక్ష్మీపురం: విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం పోరాటం చేస్తున్న కార్మికులకు మద్దతుగా జిల్లా కేంద్రంలో కార్మిక సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో గుంటూరు శంకర విలాస్ సెంటర్‌లో సోమవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమానికి సీఐటీయూ నగర కార్యదర్శి కే శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు వి.రాధాకృష్ణమూర్తి, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బి.లక్ష్మణరావు మాట్లాడుతూ విశాఖలో 1600 రోజుల నుండి కార్మికులు విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం ఆందోళన చేపడుతున్నారని తెలిపారు. ఇప్పటివరకు విశాఖ ఉక్కును పరిరక్షిస్తున్నామని అనేక రకాల ప్రకటనలు చేస్తున్నారు కానీ ఆచరణలో ప్రైవేటీకరణకు అన్ని రకాల మార్గాలు ప్రభుత్వం చేపడుతుందని ఆరోపించారు. 5500 మంది కాంట్రాక్ట్ కార్మికులను విధులు నుంచి తొలగించడం అంటే విశాఖ ఉక్కును పరిరక్షించటమా అని ప్రశ్నించారు. చిత్తశుద్ధి ఉంటే తక్షణమే కార్మికులందరినీ విధులకు హాజరయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిర్బంధాలతో ఉద్యమాలను ఆపాలనుకుంటే అంతకంటే హేయమని చర్య మరొకటి లేదన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఏ అరుణ్ కుమార్, ఎం.హనుమంతరావు, ఏపీఎఫ్‌టీయూ నాయకులు మేకల రవి, సీఐటీయూ పశ్చిమ నగర ప్రధాన కార్యదర్శి బి.ముత్యాలరావు, అధ్యక్షుడు బి.సత్యనారాయణ పాల్గొన్నారు.

వైద్య కళాశాల అభివృద్ధికి దాతల సహాయం ఎనలేనిది



డాక్టర్ హేమంత్‌ను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్‌సుందరాచారి, వైస్ ప్రిన్సిపాల్ శ్రీధర్

గుంటూరు మెడికల్: గుంటూరు వైద్య కళాశాల అభివృద్ధికి దాతల సహాయం ఎనలేనిదని గుంటూరు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నాగార్జునకొండ వెంకటసుందరాచారి అన్నారు. గుంటూరుకు చెందిన న్యూరో సర్జన్ డాక్టర్ ఉప్పుటూరి హేమంత్ వైద్య కళాశాలలో గేటు నిర్మాణం కోసం రూ.4 లక్షలు విరాళంగా ఇచ్చారు. విరాళంతో నిర్మించిన గేటును సోమవారం డాక్టర్ హేమంత్ ఉప్పుటూరి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ సుందరాచారి మాట్లాడుతూ వైద్య కళాశాలలో దాతల సహాయంతో ఆరు నెలలకాలంలో రూ.4 కోట్లతో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. కార్పొరేట్ వైద్య సౌకర్యాలను కళాశాల విద్యార్థులకు దాతల సహాయంతో అందిస్తున్నామని చెప్పారు. విరాళం అందజేసిన డాక్టర్ హేమంత్‌ను సత్కరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీధర్, డాక్టర్ ప్రభాకర్, సీనియర్ న్యూరోసర్జన్ డాక్టర్ శేషాద్రి శేఖర్ పాల్గొన్నారు.

యోగాను జీవితంలో భాగం చేసుకోవాలి



అవగాహన ర్యాలీలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు

నెహ్రూ నగర్: యోగాని ప్రతి ఒక్కరూ జీవన విధానంలో భాగం చేసుకుంటే మెరుగైన ఆరోగ్యాన్ని పొందడానికి వీలుంటుందని ప్రత్తిపాడు శాసన సభ్యులు డాక్టర్ బూర్ల రామాంజనేయులు పేర్కొన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన యోగాంధ్ర 2025లో భాగంగా జిల్లా కలెక్టరేట్ నుంచి నగరంపాలెం మూడు బొమ్మల సెంటర్ వరకు యోగాపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మే 21 నుంచి జూన్ 21వ తేదీ వరకు రాష్ట్రంలో సుమారు కోటి మందికి యోగాని పరిచయం చేయడమే లక్ష్యంగా పలు కార్యక్రమాలు చేపడుతుందన్నారు. ఏపీఐడీసీ చైర్మన్ డేగల ప్రభాకర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ ఆరోగ్యమే కీలకమని, ప్రస్తుతం ప్రజలు ఎదుర్కొంటున్న అనేక ఆరోగ్య రుగ్మతలను యోగా ద్వారా తగ్గించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ సజీల, నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డెప్యూటీ కమిషనర్ సిహెచ్.శ్రీనివాస్, బయలాజిస్ట్ రామారావు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

పొన్నూరు: పట్టణంలోని లాడ్జిలలో బస చేసేందుకు వచ్చే వారి వద్ద ఆధార్ కార్డు ఉంటేనే అనుమతి ఇవ్వాలని.. ఎలాంటి ఐడీ కార్డులేని పక్షంలో గదులు అద్దెకు ఇవ్వవద్దని పట్టణ సీఐ వీరా నాయక్ లాడ్జి నిర్వాహకులకు సూచించారు. సోమవారం పట్టణంలోని లాడ్జిలలో ఆయన ఆధ్వర్యంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. లాడ్జిల్లో ఉంటున్న వారి వివరాలను పరిశీలించారు. లాడ్జిలలో బస చేసే అపరిచిత వ్యక్తుల సమాచారం ఇవ్వాలని నిర్వాహకులకు సూచించారు. లాడ్జిలలో అసాంఘీక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శాంతి భద్రతలను కాపాడడానికి సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ శ్రీహరి, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కొరిటిపాడు: విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా మంగళవారం సరఫరా నిలిపివేయనున్నట్లు గుంటూరు–2 డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎన్.గురవయ్య సోమవారం తెలిపారు. ఉదయం 8 నుంచి 12 గంటల వరకు సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని చెప్పారు. చంద్రమౌళి నగర్ 5వలైను, 7వ లైను తదితర ప్రాంతాల వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

అలరించిన సీతాకల్యాణం హరికథా గానం



నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై కాజన విశ్వరూపాచారి వర్ధంతి సందర్భంగా సోమవారం సీతాకల్యాణం హరికథాగానం నిర్వహించారు. ఆలయ కమిటీ సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు. ప్రముఖ హరికథా భాగవతారిణి తిరువళ్లూరి దివ్యసాయి సీతాకల్యాణాన్ని హరికథాగానం వివరించారు. వయోలిన్‌పై దక్షిణామూర్తి, మృదంగంపై సుబ్బారావు వాయిద్యాన్ని అందించారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలు మృతి

గుంటూరు రూరల్: రోడ్డు దాటుతున్న వృద్ధురాలను మితిమీరిన వేగంతో వస్తున్న క్రషర్ లారీ ఢీకొనటంతో అక్కడికక్కడే ఆమె మృతి చెందింది. ఈ సంఘటన నల్లపాడు గ్రామంలోని కాలువ సెంటర్ వద్ద సోమవారం చోటు చేసుకుంది. సీఐ వంశీధర్ తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని స్తంబాలగరువుకు చెందిన మట్టుపల్లి కోటేశ్వరమ్మ(60) ఉదయం కాలువ సెంటర్‌లోని శ్రీనివాసకాలనీ వద్ద పనిపై వచ్చింది. అనంతరం రోడ్డును దాటుతుండగా పేరేచర్ల నుంచి వస్తున్న లారీ ఢీకొనటంతో ఆమె అక్కడికక్కడే ఛిద్రమై మృతి చెందింది. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు సంఘటన స్థలికి చేరుకుని మృత దేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురికి తరలించారు. లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు పేర్కొన్నారు.

మంగళగిరి పట్టణ సీఐగా వీరాస్వామి

తాడేపల్లి రూరల్: మంగళగిరి పట్టణ సీఐగా వీరాస్వామిని నియమిస్తూ గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. మంగళగిరి పట్టణ సీఐగా ఉన్న వినోద్ కుమార్‌ను వీఆర్‌కు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. వీరాస్వామి గతంలో గుంటూరులో విధులు నిర్వహించారు. నేడు బాధ్యతలు స్వీకరించనున్నట్లు సమాచారం.

ప్రజలు ఇచ్చే అర్జీల శాశ్వత పరిష్కారానికి చర్యలు



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

నెహ్రూనగర్: నగరంలో స్థానిక సమస్యల పరిష్కారం కోసం నగరపాలక సంస్థలో చేపట్టే డయల్ యువర్ కమిషనర్, పీజీఆర్ఎస్‌లో ప్రజలు ఇస్తున్న అర్జీల శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. సోమవారం నగరపాలక సంస్థ కమిషనర్ చాంబర్‌లో డయల్ యువర్ కమిషనర్, కౌన్సిల్ హాల్‌లో పీజీఆర్ఎస్ నిర్వహించారు. పీజీఆర్ఎస్‌లో మేయర్ రవీంద్ర పాల్గొన్నారు. తొలుత డయల్ యువర్ కమిషనర్ ద్వారా ప్రజల నుంచి అందిన 20 ఫిర్యాదులు తీసుకొని, అధికారులతో మాట్లాడుతూ ప్రజల నుంచి అందే అర్జీల్లో తక్షణం పరిష్కారం చేయగలిగినవి, కొంత సమయం తర్వాత చేయగలిగినవి వేరువేరుగా లిస్టు తయారు చేయాలని కోరారు. డయల్ యువర్ కమిషనర్‌కి అందిన అర్జీల పరిష్కారానికి విభాగాధిపతులే క్షేత్ర స్థాయి పరిశీలనకు వెళ్లాలని చెప్పారు. అర్జీల పరిష్కార పురోగతిపై కమిషనర్ చాంబర్‌కు ఎప్పటికప్పుడు నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. అనంతరం కౌన్సిల్ సమావేశ మందిరంలో పీజీఆర్ఎస్ కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి అర్జీలు తీసుకొని అధికారులతో మాట్లాడుతూ ప్రజలు ఇస్తున్న అర్జీలను సమగ్రంగా పరిష్కారం చేయాలని, ఆయా అర్జీలను ర్యాండమ్‌గా క్షేత్ర స్థాయి పరిశీలన చేస్తామన్నారు. పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, రోడ్ల ఆక్రమణ వంటి సమస్యల పరిష్కారం కోసం ప్రజలు జీఎంసీ కార్యాలయానికి వస్తున్నారని, అవి స్థానికంగానే పరిష్కారం చేయాలన్నారు. ప్రజల నుంచి అందే అర్జీలు, ఫిర్యాదుల నమోదుకి ప్రతి విభాగంలో ప్రత్యేకంగా రిజిస్టర్ ఏర్పాటు చేయాలని కోరారు. పరిష్కారం అనంతరం ఫిర్యాదికి సమాచారం తెలియజేయాలన్నారు. సోమవారం ప్రజల నుంచి మొత్తం 29 ఫిర్యాదులు అందాయని వాటిలో పట్టణ ప్రణాళిక విభాగానికి 8, ఇంజినీరింగ్ విభాగానికి 8, రెవెన్యూ విభాగానికి 5, ప్రజారోగ్య విభాగానికి 5, పరిపాలన విభాగానికి 1, అకౌంట్స్ విభాగానికి 2 చొప్పున ఫిర్యాదులు అందాయన్నారు. పీజీఆర్ఎస్‌లో ప్రజల నుంచి అందిన అర్జీలను విభాగాల వారిగా విభజించి, సంబంధిత విభాగాదిపతులకి పంపి సమస్యల సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో డెప్యూటీ కమిషనర్ శ్రీనివాసరావు, మేనేజర్ బాలజీ బాషా పాల్గొన్నారు.

ఏసీ కళాశాల విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ మోజెస్

గుంటూరు ఎడ్యుకేషన్: ఏసీ కళాశాలలో ఇంటర్మీడియెట్ హెచ్ఈసీ విభాగం నుంచి అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులు ప్రభుత్వం నుంచి ప్రతిభా పురస్కారాలు అందుకున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.మోజెస్ తెలిపారు. సోమవారం కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సీనియర్ ఇంటర్ హెచ్ఈసీలో 960 మార్కులు పొందిన గోరంట్ల లిఖిత్, 831 మార్కులు సాధించిన షేక్ ఫారూఖ్ అబ్దుల్లా రైజింగ్ స్టార్ అవార్డులను అందుకోవడం కళాశాలకు గర్వకారణమన్నారు. జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా రూ.20 వేల నగదు, జ్ఞాపిక, ప్రశంసా పత్రం అందుకున్నారని పేర్కొన్నారు. ఈసందర్భంగా ఏసీ లా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గురవయ్య, కళాశాల చరిత్ర శాఖ విభాగాధిపతి ఎం.శిరిల్ కుమార్, అధ్యాపకులు ఎం.జాన్ న్యూటన్, పి.రాజేష్ విద్యార్థులను అభినందించారు.

గ్రామీణ బ్యాంక్ మెసెంజర్ ఉద్యోగులకు న్యాయం చేయాలి



రఘునాథరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న వెంగళరెడ్డి, కృష్ణయ్య, వెంకట్రాముడు తదితరులు

కొరిటిపాడు(గుంటూరు): ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ మెసెంజర్ ఉద్యోగులకు న్యాయం చేయాలని కోరుతూ బీఎంఎస్ ఆధ్వర్యంలో బ్యాంక్ జనరల్ మేనేజర్ రఘునాథరెడ్డికి సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీఎంఎస్ నాయకుడు జి.వెంగళరెడ్డి మాట్లాడుతూ డేట్ ఆఫ్ జాయినింగ్, కంప్యూటర్ ఇంక్రిమెంట్ అరియర్స్‌లో అన్యాయం జరిగిందని పేర్కొన్నారు. ఆంధ్రా ప్రగతి గ్రామీణ బ్యాంక్‌లో పనిచేసే మెసెంజర్స్‌కు గతంలోని యాజమాన్యం చాలా ద్రోహం చేసిందన్నారు. స్పందించిన రఘునాథరెడ్డి, పరిశీలించి న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు. వినతిపత్రం అందజేసిన వారిలో వెంగళరెడ్డితో పాటు ఎం.కృష్ణయ్య కదిరి వెంకట్రాముడు, డీవీఎస్ రాజు ఉన్నారు.

రేపు సాహిత్య బాటసారి శారద పుస్తకావిష్కరణ



తెనాలిఅర్బన్: అభ్యుదయ రచయితల సంఘం, గ్రంథాలయ పునర్వికాస ఉద్యమ వేదిక జిల్లా శాఖల సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 11వ తేదీన సాహిత్య బాటసారి– శారద స్మృతి శకలాలు పుస్తకాన్ని తెనాలిలో ఆవిష్కరించనున్నట్లు అరసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరు శివప్రసాద్, జిల్లా అధ్యక్షుడు చెరుకుమల్లి సింగారావులు తెలిపారు. బుధవారం ఉదయం 10.30గంటలకు ఏఎస్ఎన్ కళాశాలలోని కాన్ఫిరెన్స్ హాల్‌లో జరిగే కార్యక్రమానికి వివేక విద్యాసంస్థల డైరెక్టర్ రావిపాటి వీరనారాయణ అధ్యక్షత వహించనున్నట్లు చెప్పారు. అరసం జాతీయ అధ్యక్షుడు, కేంద్ర సాహిత్య అకాడమి పురస్కార గ్రహీత పెనుగొండ లక్ష్మీనారాయణ పుస్తకాన్ని ఆవిష్కరించనున్నట్లు వివరించారు. అలాగే కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కర గ్రహీత పాపినేని శివశంకర్ ముఖ్యఅతిథిగా, మానవత తెనాలి చైర్మన్ డాక్టర్ కొలసాని రామ్‌చంద్ విశిష్ట అతిథిగా పాల్గొంటారన్నారు. 1985లో అలూరి భుజంగరావు రచించిన పుస్తకాన్ని తెనాలి ఇంప్రెషన్స్ వారు పునఃముద్రణ చేసినట్లు పేర్కొన్నారు. నటరాజన్ శారద మద్రాస్ నుంచి తెనాలి వచ్చి హోటల్ కార్మికునిగా పనిచేస్తూ తెలుగు నేర్చుకుని ప్రసిద్ధ రచయితగా ఎదిగారని గుర్తు చేశారు.

నటరాజన్ శారద జీవిత విశేషాలు

తెలుగు సాహితీ ప్రపంచంలో శారదనే కలం పేరుతో సుప్రసిద్ధులైన రచయిత నటరాజన్ శారద ఆయన అసలు ఎస్.నటరాజన్ 1924లో తమిళనాడులో సుబ్రహ్మణ్య అయ్యర్, భాగీరథి దంపతులకు జన్మించారు. 2వ ఏటనే తల్లిని కోల్పోవడంతో తన సోదరిల వివాహాల కారణంగా తండ్రితో కలిసి ఆయన 1937లో తెనాలి వచ్చారు. చిన్న వయస్సులోనే ప్రాచీన ఆధునిక తమిళ సాహిత్యాన్ని ఆకళింపు చేసుకున్నారు. తురగా వెంకటేశ్వరరావు అనే ఉపాధ్యాయుని వద్ద తెలుగు ఓనమాలు నేర్చుకుని, 1948 నుంచి 1950 వరకు రచనలు చేశారు. ప్రపంచానికి జబ్బు చేసింది అనేది తొలి వ్యంగ రచయిన, ప్రజావాణి, చంద్రిక అనే పత్రికలను ప్రారంభించి సంపాదకునిగా వ్యవహించారు. ఏది సత్యం, మంచి చెడు, అపస్వరాలు, చీకటి తెరలు, మహీపతి, అందాల దీవి, చదరంగం, సందేశం, నాగరీకుని ప్రేమ, కార్యదర్శి, హోటల్లో శవం వంటి ప్రసిద్ధి కథలు రచించారు. పేద మధ్యతరగతి ప్రజల జీవితాలు, వాటి కష్టాలు, మానసిక సంఘర్షణలు ఆయన రచనల్లో స్పష్టంగా కనిపిస్తాయి. నటరాజన్ శారద 1955 ఆగస్టు 17న మూర్ఛ వ్యాధితో మరణించారు.

విజ్ఞాన్ నిరుల అధ్యాపకునికి డాక్టరేట్



డాక్టరేట్ పొందిన ఆనంద్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ రాధిక

గుంటూరు రూరల్: తమ కళాశాలలో పనిచేస్తున్న అధ్యాపకుడు జూపల్లి జెర్మయ్యానంద్‌కు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం డాక్టరేట్‌ను ప్రదానం చేసిందని విజ్ఞాన్ నిరుల మహిళా ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రాధిక తెలిపారు. సోమవారం పెదపలకలూరు రోడ్డులోని కళాశాలలో ఏర్పాటు చేసిన అధ్యాపకుని అభినందన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఆచార్య భట్టు నాగరాజు పరిశోధనా పర్యవేక్షణలో హ్యూమన్ రిసోర్స్ మానేజ్మెంట్ విభాగంలో 'క్వాలిటీ ఆఫ్ వర్క్ లైఫ్ ఆఫ్ విమెన్ ఎంప్లాయిస్ ఇన్ సౌత్ సెంట్రల్ రైల్వేస్ ఏ కంపేరటివ్ స్టడీ అమాంగ్ టెక్నికల్ అండ్ నాన్ టెక్నికల్ స్టాఫ్' అనే అంశంపై ఆనంద్ సమర్పించిన పరిశోధనకు డాక్టరేట్ లభించిందన్నారు. డాక్టరేట్ పొందిన అధ్యాపకుడికి విజ్ఞాన్ విద్యాసంస్థల అధ్యక్షుడు డాక్టర్ లావు రత్తయ్య, ఉపాధ్యక్షుడు లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎంబీఏ విభాగాధిపతి డాక్టర్ ఇ.వేణుమాధవి, ఇతర అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

పరిహారం రాకుంటే ఆందోళన తథ్యం

- అగ్నిబాధిత పసుపు రైతుల కమిటీ కన్వీనర్ జొన్నా శివశంకరరావు
- సబ్‌కలెక్టర్‌తో పసుపు పంట బీమాపై వినతి



సబ్‌కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న రైతులు

తెనాలి: దుగ్గిరాలలోని శుభం మహేశ్వరి కోల్డ్‌స్టోరేజీ అగ్నిప్రమాద బాధితులు నష్టపోయిన పసుపునకు క్వింటాలుకు రూ.7,000 చొప్పున పరిహారం వచ్చేలా చూడాలని లేకుంటే ఆందోళన తథ్యమని అగ్నిబాధిత పసుపు రైతుల కమిటీ కన్వీనర్ జొన్నా శివశంకరరావు స్పష్టం చేశారు. కమిటీ ఆధ్వర్యంలో బాధిత పసుపు రైతులు సోమవారం స్థానిక సబ్‌కలెక్టర్ వి.సంజనా సింహాను కలిసి వినతిపత్రం అందజేశారు. తమ సమస్యలను విన్నవించారు. రెండు మూడేళ్లుగా సాగు చేసి పండించిన పంట మొత్తం ప్రమాదంలో కాలిపోయిందని గుర్తుచేశారు. అప్పుడు చేసిన అప్పులు తీర్చటానికే వీలుకావటం లేదని, మళ్లీ వ్యవసాయం చేయటానికి పెట్టుబడులు లేవని చెప్పారు. బాకీలు తీర్చమంటూ రోజూ ఇంటికి వస్తున్న అప్పుల వాళ్లతో ఇబ్బందులు పడుతున్నామని, త్వరగా పరిహారం ఇప్పించి తమకు పరిష్కారం చూపాలని కోరారు. సబ్‌కలెక్టర్ సంజనా సింహా మాట్లాడుతూ అధికారుల నుండి అన్ని పత్రాలు, సంబంధిత బీమా కంపెనీకి ముంబయిలో గల ప్రధాన కార్యాలయానికి వెళ్లాయని చెప్పారు. అక్కడ ప్రాసెసింగ్‌కు కనీసం పదిరోజుల సమయం తీసుకుంటుందని చెప్పారని, ఆవిధంగా మరో మూడురోజుల సమయం పడుతుందని భావిస్తున్నానని చెప్పారు. అయినా మరోసారి విచారిస్తానని హామీనిచ్చారు. కృష్ణాజిల్లా జగ్గయ్యపేటలో కోల్డ్‌స్టోరేజి తగులబడిన ఘటనలో నష్టపోయిన మిర్చి పంటకు 1120 మంది రైతులకు డబ్బులు వచ్చేశాయనీ, తమకు మాత్రం ఎందుకు న్యాయం జరగటం లేదని రైతులు ప్రశ్నించారు. ఏదేమైనా సబ్‌కలెక్టర్ మాటపై మరో వారంరోజులు వేచిచూస్తామన్నారు. అప్పటికీ సానుకూలం కాకుంటే రోడ్డెక్కి ఆందోళన చేస్తామని హెచ్చరించారు. అంతవరకు రాకుండానే పని జరుగుతుందని భావిస్తున్నట్టు సబ్‌కలెక్టర్ అన్నారు. ఒక సందర్భంలో 'మీరు నా దగ్గరకు ఎన్నిసార్లు వచ్చారో...అంతకన్నా ఎక్కువ సార్లు ఫాలోఅప్ చేశాను' అని ఆమె వివరించారు. రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి మాట్లాడుతూ అసెంబ్లీ సమావేశాలకు ముందే డబ్బులు ఇప్పిస్తామని మంత్రి రైతులకు చెప్పారని, ఇంతవరకు ఆచరణలో జరగలేదన్నారు. వ్యవసాయం చేసేందుకు, కుటుంబ ఖర్చులకు డబ్బులు లేక, అప్పు పుట్టక రైతులు ఆందోళన పడుతున్నారని, అలాంటివారు ఏదైనా తీవ్ర నిర్ణయం తీసుకోకముందే ప్రభుత్వం న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో నాదెళ్ల చంద్రశేఖర్, ఆళ్ల వెంకటప్పారెడ్డి, ఆళ్ల గోవిందరెడ్డి, దేవతి సత్యనారాయణ, తుంగల వీరరాఘవులు, కొమారెడ్డి రంగారెడ్డి, బొల్లిముంత రామారావు, పానకాలరెడ్డి, భీమవరపు చినరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాల ముఠాలను అరికట్టాలి



పెదకాకాని: ప్రభుత్వం నకిలీ విత్తనాలు విక్రయించి సొమ్ము చేసుకుంటున్న ముఠాల ఆగడాలను అరికట్టాలని రాష్ట్ర వ్యవసాయ సంఘం కార్యదర్శి కేవీవీ ప్రసాద్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో సోమవారం పెదకాకాని మండల కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమానికి జిల్లా రైతు సంఘం అధ్యక్షులు కొల్లి రంగారెడ్డి అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న కేవీవీ మాట్లాడుతూ.. ఖరీఫ్ పంటల సీజన్ మొదలైన నేపథ్యంలో ప్రభుత్వం సబ్సిడీపై విత్తనాలు పంపిణీ చేసి నకిలీ విత్తనాల ముఠాల ఆగడాలను అరికట్టాలని కోరారు. కౌలు రైతు కార్డులు త్వరితగతిన ప్రతి రైతుకు అందే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా మహిళా సమైక్య కార్యదర్శి రెంటాల కుమారి, జిల్లా అగ్రిగోల్డ్ బాధితుల సంఘం కార్యదర్శి కేతినేని అగస్టీన్, నంబూరు గ్రామ సీపీఐ కార్యదర్శి కూసం నాగిరెడ్డి, వెనిగండ్ల సీపీఐ కార్యదర్శి షేక్ బాషీద్ పాల్గొన్నారు.